# దైవధ్యానం

నేను జోళ్ళేసుకుని బయటపడ్డాను. ఉదయం ఏడు గంటలు కావస్తోంది. జనవరి చివరి వారం. వాతావరణం చలిగా వున్నా, అప్పుడప్పుడే వెచ్చదనాన్ని సంతరించుకుంటోంది. నిజానికి అది ఎంతో ఆహ్లాదం కలిగించాల్సిన సమయం. కానీ, నేను ఆ వాతావరణంలోని ఆనందాన్ని పొందలేకపోతున్నాను. అసలు ఆనందమైనా, విచారమైనా మనసులో ఉంటుంది. అది ఏ విధంగా వుంటే దాన్ని అనుసరించి బయట ప్రకృతి కనిపిస్తూ ఉంటుంది.

ఫిబ్రవరి నెలకి నాకు అరవై ఏళ్ళు నిండుతాయి. ఇంతవరకూ పెద్దగా అశాంతిపాలై బాధపడింది లేదు. ఆవేదన పడిందీ లేదు. తల్లీదండ్రీ నా జీవితం స్థిరపడి ఉద్యోగస్తుణ్ణి అయ్యేవరకూ బ్రతికే వున్నారు. మంచీ చెడ్డా చూసారు. ఉన్న ఆస్తి ఏదో ఇచ్చారు. జబ్బులేమీ నన్ను ఎప్పుడూ ఇబ్బంది పెట్టింది లేదు. మంచి ఉద్యోగంలో చేరాను. మంచి అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాను. మంచి పుస్తకాలు చదువుకున్నాను. చాలా నెమ్మదస్తుడిగా, మంచివాడిగా పేరు పడ్డాను. నేను చదువుకున్న గొప్పవారి పుస్తకాల నుండి నాకు తోచిన విషయాలు వివరిస్తూ కొన్ని వ్యాసాలు రాశాను. వాటిని పత్రికలవాళ్ళు అచ్చువేశారు. నేను ఆశించిన దానికంటే ఎక్కువే పేరు, డబ్బూ వచ్చాయి.

ఏభై ఎనిమిదేళ్ళు నిండగానే ఉద్యోగ విరమణ చేసి విశ్రాంతిగా వున్నాను. నేను నిర్వహించాల్సిన బాధ్యతలు ఏమీ లేవు. పిల్లవాడు మంచి ఉద్యోగంలో వున్నాడు.

చక్కని పిల్లని చూసి పెళ్ళి చేశాను. వాడు చీకూ చింతా లేకుండా సంసారం చేసుకుంటున్నాడు. పిల్లకి కూడా మంచి సంబంధం చేశాను. హాయిగా వుంది దాని జీవితం కూడా.

కమల నాకు అన్ని విధాల తగిన భార్య. ముప్పయ్ ఏళ్ళు కాపురం చేసిన తర్వాత ఇప్పుడిప్పుడే కాస్త దబాయింపు నేర్చుకుంది. అదీ ఒక్క విషయంలోనే-

"అవునూ మీకు ఏ వయసుకు రావలసిన మార్పు ఆ వయసుకి రాలేదు. అదేమి చోద్యమో మీరు ఏనాడూ పరధ్యాన్నంగా కూడా కృష్ణా - రామా అనడం వినలేదు. చిన్నతనంలో అంటే అది వేరు. ఇంత వయసు వచ్చినా, ఆ పుస్తకాలన్నీ ముందేసుకుని, ఆ గదిలో ఇరవై నాలుగ్గంటలూ మగ్గిపోకపోతే - కాస్త అలా గుడికి వెళ్ళిరావడమో, ఇంట్లో దీపారాధన చేసుకోవడమో, సంధ్య వార్చుకోవడం, కాస్సేపు భగవద్గీత చదవడం - ఏదీ లేదు. నాతో అలా సాయంకాలాలన్నా గుడికి రాకూడదు - మీ సాహితీ సభలకి, వాటికీ నే రావడం లేదూ-" అంటూ ఈ మధ్య మరీ తరచూ సాధించి పోస్తోంది. నిజానికి కమల వేసే ప్రశ్నలు వేటికీ నా దగ్గర జవాబు లేనేలేదు. నిజమే మరి. ఈ వయసులో ప్రతి మనిషి నుదుట కుంకుమబొట్టు పెట్టి, సంధ్యావందనం చేసుకుంటూ, గీతాపారాయణం, సాయంత్రం గుడికి వెళ్ళడం - వేదాంతోపన్యాసాలు వింటూ దినచర్య సాగించాల్సిన తరుణంలో, నాకు అవేమీ పట్టకుండా వుంటే ఊళ్ళోవాళ్ళ మాట ఎలా వున్నా ముందు కమలకి ఎలాగో వుంది. మొన్న పక్కింటి పార్వతమ్మగారు 'మీ వారు నాస్తికులా?' అనీ అడిగేసరికి కమల ఒకటే బాధపడిపోయింది. కళ్ళనీళ్ళు పెట్టేసుకుంది. నేను చాలా ఇరకాటంలో పడిపోయాను. నా భార్యని సంతృప్తిపరచటానికి ఆవిడ దృష్టిలో ఆస్తికుడిగా గుర్తింపు కలగడానికి నేను భక్తుడ్ని కావాలి అనే ఊహ నాకెంతో భయంకరంగా అనిపించింది. నేనెప్పుడూ ఏ విషయంలోనూ కమలను బాధించలేదు. ఆమె తప్ప నాకు మరో ధ్యాసలేదు. ఎప్పుడైనా జిహ్వకి నచ్చని కూర చేసినా, సర్దుకుని తినేసేవాడ్ని. తర్వాత ఆమె బాధపడి ఆ కూర మరి చేసేది కాదు. కాని ఇది కూర కాదు కదా తినడానికి! ఆమె సవాలుకి జవాబు నా మౌనమైంది. నేను ఆమె మాటను తీసిపారేస్తున్నానని కమల కష్టపెట్టుకుంది.

నేను భక్తి గురించి దేవుడి గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ఎందుకో నా మనసు దేవుడివైపు మొగ్గలేదు. అసలు దేవుడనేవాడు ఎవరు? ఎందుకు నాకు

అవసరం లేదనుకున్నా, నా దగ్గరకొచ్చి నన్ను బాధిస్తాడు? నిజంగా నా మనసులో భక్తిలాటిది కలిగితే చేతులెత్తి నమస్కరించడానికి నా కభ్యంతరం లేదు. కానీ మనసులో లేనిది ఎవరికోసమో నటించమంటే మాత్రం మనస్కరించడంలేదు. నా స్వభావాన్ని ఎగతాళి చేస్తూ, వేళాకోళంగా ఆట పట్టిస్తున్నప్పటికీ కమల నన్నెప్పుడూ నిర్లక్ష్యం చెయ్యలేదు. అనుక్షణం నన్ను అంటిపెట్టుకునే వుంది.

మూడు రోజుల వరకూ నాకు ఏ చీకూ చింతా లేదు. అయితే మొన్నటి ఉదయం జరిగిన సంఘటనతో నా జీవితంలో నేను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చిన శాంతి ధ్వసంమైందనిపించింది. నేను ఎంతవరకు బాధ్యుణ్ణి దానికి? - అంటే జవాబు ఒక్కటే - నా తప్పుగానీ, ప్రమేయంగానీ లేవు.

నేను నడుస్తున్నాను. సాయిబాబా మందిరంలో సుందరేశ్వర స్వామివారు పదిహేనురోజుల నుండి గీతోపన్యాసాలు ఇస్తున్నారు. ఊరూ వాడా అంతా అక్కడే వున్నారు. ఆయన మాటలూ, వ్యాఖ్యానాలు మళ్ళీ మళ్ళీ తల్చుకుంటూ మోక్షసాధనకు మార్గం దొరికినట్లు సంబరపడిపోతున్నారు. కమల రెండు మూడుసార్లు అంది "ఆయన ఉపన్యాసాలు బావున్నాయి మీరూ రాకూడదా" - అని.

"నాకంత ఆసక్తిగా వుండదు. నువ్వెళ్ళి వింటున్నావుగా"- అన్నాను. ఆమె వెళ్ళి వచ్చి నా తెలివితక్కువతనానికి ఎంతో వగచేది.

ఈ రోజు నేను సాయిబాబు గుడివైపు నడుస్తూంటే నాకెలాగో అనిపించింది. నా జీవితంలో నేను ఓడిపోయానా అనిపించింది. నిజానికి నేను ఇంట్లోంచి బైటికొస్తూ గుడికి వస్తున్నట్లు చెప్పలేదు కమలకి. చెప్పినా నా మాట వినిపించుకోదు. అదే మూడురోజుల క్రితం అయితే నాకు బ్రహ్మరథం పట్టేది. అడుగులకు మడుగులొత్తేది. తప్పకుండా బయల్దేరే ముందు మరో కప్పు కాఫీ ఇచ్చేది. కానీ ఈ రోజు అలా జరగలేదు. ఆమె ముభావంగా వుంది. ముప్ఫయ్ అయిదు సంవత్సరాలుగా నేను ఆమె నుండి పొందుతూన్న ఆలన, పాలన, ప్రేమలను ఈ మూడు రోజుల ఆమె తిరస్కరణ, ఉదాసీనతా కొట్టిపారేశాయి. ఒక వస్తువును పొందినప్పుడు దాని విలువ తెలీదు. అది చేజారిపోయినప్పుడు దాని విలువ, అది పోయిందనుకున్న దిగులు తెలుస్తుంది. మానవుడి మనసు రగిలి మనుగడ నలిగిపోయినప్పుడు ఆసరా కోసం దేవుడనే ఆధారం కోసం తాపత్రయపడడం మొదలు అవుతుందనిపించింది.

కొన్ని సంఘటనలు అర్థరహితంగా జరిగిపోతాయి. కొందరు మనుషులు అర్థరహితంగా ప్రవర్తిస్తారు. మనకి సంబంధం లేని ఎదుటివారి ప్రవర్తనకి ఒక్కొక్కసారి మనం బలైపోవడం జరుగుతూ ఉంటుంది.

❖ ❖ ❖

ఆ రోజు సరిగ్గా ఆరుగంటలకే మెలకువ వచ్చేసి లేచేసాను. వాతావరణం ఎంతో బావుంది. ఎందుకోగానీ కారణం లేకుండా మనసు ఎంతో ఉల్లాసంగా వుంది. మంచు దట్టంగా వుంది - బద్ధకంగా కదులుతూ వాకిట్లో వున్న మల్లె పందిరిమీద జారి ప్రతీ ఆకూ తళతళలాడుతున్నాయి. నేను ముందు లేచానని కమల హడావిడిగా ఫిల్టరు కాఫీ కలిపి నాచేతికందించింది. పేపరు చదువుతూ, వెచ్చని కాఫీ తాగుతూ, అప్పుడప్పుడూ ఓ కంట ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నాను.

గేటు శబ్దమైతే తలెత్తి చూశాను. ఎవరో ఒకామె గేటు తీసుకుని లోపలికి వస్తూ, కాస్త బిడియంగా అటూ ఇటూ చూస్తోంది. పచ్చని బంగారు వన్నె ఛాయలో - ఆకుపచ్చని గుంటూరు జరీచీర కట్టుకున్న ఆవిడ, నిండుగా మనిషి హుందాగా నడిచివస్తోంది. నేను హడావిడిగా కుర్చీలోంచి లేచాను. నేను లోపలికి పోయి కమలని పిలిచేంతలో ఆమె ఫలానా వారిల్లు ఇదేనా? అని అడిగింది.

"అవును - నాపేరే అది - రండి లోపలికి" అంటూ "కమలా!" - అని కేకేశాను.

"ఫర్వాలేదులెండి. ఆమె పనిలో వున్నారేమో నేను వచ్చింది మీతో పని వుండే" - అంది. అంత వయసు వచ్చినా నేనొక్కక్షణం తత్తరపడ్డాను. ఉదయపు నీరెండ ఆమె చంపల మీద నిగనిగమెరుస్తోంది. తట్టుకోలేని ఆ ముఖ వర్చస్సు సౌందర్యం చూసి తడబడిపోయాను. ఆమెకి ఏభై ఏళ్ళు వుంటాయి. నెరసిన చిరు వెంట్రుకలు ఆమె చెంపలికి మరింత అందాన్ని కూరుస్తున్నాయి. ఆమె నాతోనే పని వుందనడం కొంచెం ఇబ్బంది అనిపించినా మరేం మాట్లాడలేకపోయాను. ఆమె అక్కడే వున్న పేము కుర్చీలో కూర్చుంది నాకేక విని లోపలి నుండి వచ్చింది కమల. నాకే ఎవరో తెలియనప్పుడు ఇక పరిచయం చెయ్యడంలో వున్న ఇబ్బంది బాగా తెలియవచ్చింది.

"ఈమె..." అంటూ నసిగాను.

ఆమె చటుక్కున తలెత్తి సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ "నన్ను గుర్తుపట్టలేదా" అనడం - ఎప్పటిదో నలభై ఏళ్ళనాటి స్మృతి నా మదిలో విద్యుద్ఘాతంగా తగలడం

ఒకేసారి జరిగింది. ఎందుకో నా గుండె ఒక్క క్షణం లయ తప్పింది. అది ఆనందమో, అద్భుతమో, ఏమో చెప్పడం కష్టం. నేను మాట్లాడకపోయినా నా కళ్ళలో ఆమెను గుర్తించిన మెరుపు ఆమె గ్రహించింది. ఆమె చెప్పడం మొదలుపెట్టింది.

"నన్ను గుర్తుపెట్టుకోవడం కష్టమే. ఇప్పుడు జ్ఞాపకం చేసుకోవడమూ కష్టమే".

"చాలా ఏళ్ళయిందనుకుంటాను మిమ్మల్ని చూసి" అంది కమల. అంటే అంతకంటే ఏం మాట్లాడాలో తెలియలేదని అర్థం అవుతూనే వుంది.

"అవును మరి అసలు మీ వారికీ నాకూ పెళ్ళి జరగాల్సింది. కొంచెంలో తప్పిపోయింది" అని నావైపు తిరిగి – "దాదాపు నిశ్చయమైపోయింది. నెల్లాళ్ళు ఆ ఇంటికీ మా ఇంటికీ ఎన్నో రాకపోకలు కూడా జరిగాయి" అంది – కొంచెం సిగ్గు అభినయిస్తూ కొంటెతనం కొంత జోడించింది.

ఈ వయసులో ఈ సందర్భంలో అలాంటి ప్రస్తావన నాకెంతో సిగ్గుగా చిన్నతనంగా అనిపించింది. అయినా నేనేం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో అర్థం కాలేదు. కమల కూడా ఇంచుమించు అలాంటి స్థితిలోనే వుంది. మేమిద్దరం మౌనంగా వున్నందుకైనా ఆమె తన సంభాషణ ఆపేస్తే బాగుండేది – కానీ అలా జరగలేదు.

"అప్పుడేదో వచ్చి ఈ సంబంధం దాటిపోయింది. నా పెళ్లి అయిన చాలా రోజు లీయన పెళ్ళిచేసుకోనని భీష్మించుకుని కూర్చున్నారని చెప్తూ వుండేవారు" ఆమె అనడంలో తేలిగ్గా అన్నా, నాకెందుకో ఆ అందం మాటున గొప్ప రాక్షసత్వం కనిపించింది.

నేనేం మాట్లాడాలో తెలీక చిన్నగా దగ్గాను. మర్యాదకోసం అన్నట్టు చిరునవ్వు నవ్వాను. కమల కాఫీ కలిపే ప్రయత్నమన్నట్లు లోపలికెళ్ళింది. వెనుక నుండే ఆమెలోని తత్తరపాటుని, కలవరపాటుని, బాధని, గ్రహించగలిగాను నేను.

ఆమె పేరు సుభద్ర. నేను ఎమ్.ఎ. ప్యాసయి ఉద్యోగంలో చేరిన వెంటనే మావాళ్ళు నా పెళ్ళి గురించి హడావిడి పడడం మొదలుపెట్టారు. మొట్టమొదట వచ్చిన సంబంధం ఈ సుభద్ర. పిల్లని చూసి ఇంట్లో అంతా మూర్ఛపోయారు. నాకు మతే పోయింది. వాళ్ళ నాన్నగారు స్కూలు మాస్టారు. ఎక్కువ కట్నం ఇవ్వలేనిన అన్నారు. నేను కట్నం గురించి పట్టుబట్టవద్దని ఇంట్లో చెప్పాను. మవాళ్ళు నా మాట మన్నించారు. సంబంధం స్థిరపడింది. నేను ఉప్పొంగిపోయాను. రోజూ వాళ్ళింటివైపు సాయంత్రం షికారుగా వెళ్ళి దూరం నుంచీ ఆమెని చూసేవాడ్ని. రెండు రోజులయ్యాకా

మూడో రోజు నావెనుకగా వాళ్ళ తమ్ముడు వచ్చి ఇంట్లోకి రమ్మన్నాడు. వెళ్ళాను. వాళ్ళమ్మగారు వేడి వేడి పెసరట్లు పెట్టి కాఫీ ఇచ్చారు. అప్పుడు కాఫీ గ్లాసు పట్టుకొచ్చిన సుభద్ర రూపం నా మనసులో చెరగని ముద్రవేసింది. ఆమె సౌందర్యవతే - కానీ ఆమె చూపించే చొరవ, ధైర్యం నాలో కించిత్ భయం కలిగించాయి. ఆమె నన్ను చూసి సిగ్గుపడుతూ ఎప్పుడూ తొలగిపోలేదు.

సరిగ్గా ముహూర్తం నెల వుందనగా ఆడపెళ్ళివారు ఈ సంబంధం రద్దు చేసుకుంటున్నట్లు మధ్యవర్తి ద్వారా కబురు చేశారు. నిజంగా మేమే ఆడపెళ్ళి వారమన్నట్లు బాధపడ్డాము. ఎవరిష్టమొచ్చినట్లు వాళ్లు మాట్లాడారు - అతి త్వరగా సుభద్ర పెళ్ళి ఒక ఐ.ఎ.ఎస్. ఆఫీసరుతో అయిపోయింది. నాకంటే హోదా, డబ్బు వున్న సంబంధం అని అటు తిరిగిపోయారని మా ఇంట్లో అందరితోబాటూ నేనూ లోపల్లోపల కుమిలిపోయాను. అయితే నేను వాళ్ళింట్లో అందర్నీ కసితీరా తిట్టుకునేవాడిని. కానీ ఆడపిల్ల అసహాయురాలు. సుభద్ర గురించి ఒక్కమాట కూడా అనుకోలేకపోయేవాడ్ని. నాకు సుభద్రని మర్చిపోయి మరొకర్ని చేసుకోవడం సాధ్యం కాదనిపించింది. నాకు నాలుగు నెలల తర్వాత నామిత్రుడి ద్వారా తెలిసింది. ఆ పెళ్ళి తప్పిపోవడానికి సుభద్రే పట్టుపట్టిందనీ ఆమెకి ఎమ్మే లెక్చరర్ హోదా కంటే ఐ.ఎ.ఎస్. హోదాకావాలనే పట్టుదలతో గొడవ చేసిందని, తల్లిదండ్రులు ఆమె మాట తీసెయ్యలేక మా సంబంధం వదులుకున్నారని పాపం ఆ తండ్రి పరువు పోయిందని నెల్లాళ్ళు వీధి ముఖం చూడలేదనీ".

ఆ విషయం తెలిసిన మరుక్షణం సుభద్ర అందం నాకు పైశాచికంగా కనిపించింది. ఆమెకి బాహ్య సౌందర్యమేకానీ హృదయ సౌందర్యం లేదనీ, స్వార్థమే తప్ప పరుల గురించి ఆలోచించే గుణం లేదనీ ఎదుటివారి మంచితనం మీద గౌరవం లేదని తెలిసింది.

ఆ తర్వాత తెల్లకాయితంలాంటి మనసుతో కమలని పెళ్ళి చేసుకున్నాను. కమల సుభద్ర అంత అందగత్తె కాదు. కానీ సుగుణాల రాశి. ఎప్పుడూ నా మంచిచెడ్డలూ, నా ఆరోగ్యం, నాశ్రేయస్సూ కోరుతూ నా కోసమే తను పుట్టినట్లు నాతో జీవించడం మొదలుపెట్టింది. అసలు కమలతో పెళ్ళి అయ్యాకనే ప్రేమించడం అంటే ఏమిటో తెలిసింది. "సుభద్రని నేను గాఢంగా ప్రేమించాను" అని నేను అజ్ఞానంలో అనుకున్నట్లు గుర్తొస్తే ఎంతో సిగ్గుపడేవాడ్ని.

నిజానికి సుభద్ర మా ఇంటికొచ్చిన కారణం తెలిసి కొంచెం ఆశ్చర్యపోయాను. వాళ్ళ అబ్బాయి ఎమ్.బి.ఎ. ప్యాసయి ఉద్యోగ ప్రయత్నంలో వున్నాడు. అతను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న ఫరమ్‌కి మా వియ్యంకుడు ఎడ్వయిజరీ బోర్డు మెంబరు. ఆయన ద్వారా రికమెండు చెయ్యమని ఆమె అభ్యర్థన.

ఆమె వెళ్ళిన మరుక్షణం మా ఇంట్లో మబ్బు వేసినట్లయింది. ఎప్పటిదో విషయమై నా కమల చాలా కించపడిందని నాకర్థం అయింది. ఎప్పుడో గడిచిపోయిన గతం మార్చేందుకు మన చేతిలో ఏమీ లేదు. అయినా ఇప్పుడా విషయం పట్టించుకుని బాధపడడం నాకు కొంచెం కోపం తెప్పించింది. అయితే ఒక మనిషి బాధపడదానికి కారణం ఉండదన్న విషయం నాకు వెంటనే స్ఫురించింది. నేను నా ఆలోచనలు బయటపడకుండా నిబ్బరంగా వున్నాను.

"వియ్యంకుడిగారికి ఉత్తరం రాశారా?" అంది కమల. నాకు ఛెళ్ళున ఎవరో కొట్టినట్లయింది.

"లేదు"- అన్నాను.

"ఏం" - అంది.

"అవసరం లేదు-" అన్నాను ముక్తసరిగా.

"ఓహెూ! ఫోనులో మాట్లాడేసారులా వుంది" అంటూ అక్కడ ఎప్పుడో పెట్టిన మంచినీళ్ళ గ్లాసు తీసుకుని గబగబా వెళ్ళిపోయింది. నేను చటుక్కున ఆమె చెయ్యి పట్టుకున్నాను. ఆమె శరీరం స్వల్పంగా వణుకుతోందని గ్రహించాను. ఒక్కసారి జాలితో నా గుండె నిండిపోయింది. నాకోసం ప్రతీ అణువూ స్పందించే మనిషి నేనెలా బాధిస్తాను.

"కమలా" అన్నాను. నా గొంతే నాకు బాధగా అనిపించింది. ఆమె అతికష్టం మీద తలపైకెత్తింది. ఆ కళ్ళనిండా నీళ్ళు. దుఃఖంతో నా గుండె గుబగుబలాడింది.

"ఏమిటీ కమలా ఏమైందని ఇప్పుడూ" అన్నా. "నేను మాత్రం ఏమన్నాను" అంది.

"నువ్వు చాలా తప్పుగా ఆలోచిస్తున్నావు. ఇప్పుడు... ఈ వయసులో...'

"అవునూ - నేను అదే అనుకుంటున్నాను. ఇన్నేళ్ళ తర్వాత నా మనిషి నా మనిషి కాదని తెలిసి....."

"ఛ...ఛ...అవేం మాటలు - నేనెప్పుడైనా నిన్ను బాధపెట్టానా?"

"లేదు, కానీ బాధ్యత నిర్వర్తించడం వేరు, ప్రేమించడం వేరు" - కమల నెమ్మదిగా నా చెయ్యి విడిపించుకు వెళ్ళిపోయింది లోపలికి. నేను స్థాణువులా వుండిపోయాను.

కమల చాలా స్పష్టంగా చెప్పింది. ఆమె చెప్పింది సత్యం. కానీ తను నిజంగా ప్రేమించింది, జీవించిందీ కమలనే - కమలతోనే - అదెలా చెప్పడం? నేనక్కడే కుర్చీలో కూలబడ్డాను. ఇన్నాళ్ళుగా కమలలోవున్న సునిశితమైన ఆలోచనాశక్తిని గ్రహించలేకపోయానే అనిపించింది.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. అందమైన రాక్షసిలా సుభద్ర నాకు పదే పదే గుర్తుకొచ్చింది. నిజంగా నాతో అవసరం పడి వచ్చి వుంటే, క్లుప్తంగా వచ్చిన పని చెప్పి వుండవచ్చు కానీ సుభద్ర చాలా గౌరవంగా టక్కరితనంగా చెప్పిందని నాకని పించింది. రాత్రంతా కమల నాకు దూరదూరంగా వెళ్ళిపోతున్న భావనతో కలత నిద్రలో గడిపాను.

ఆ మర్నాడు విచారించగా నాకు తెలిసిన విషయాలు నన్నాశ్చర్యపరిచాయి.

సుభద్ర మోజుపడి చేసుకున్న ఐ.ఏ.ఎస్. ఆఫీసరు మరొక ఆమెని ఉంచుకున్నాట్ట. మొదటినుండీ ఈమెని నిర్లక్ష్యం చేస్తూనే వున్నాట్ట. ఈమెకిద్దరు మగపిల్లలు. పెద్దవాడి ఉద్యోగం కోసం ఆమె వచ్చింది. నిజానికామె వచ్చి అడగాల్సిన పనిలేదు - భర్త చూసుకుంటాడు. మరెందుకు వచ్చినట్టు?

తను చేజారవిడుచుకున్న ఆనందం, సంతృప్తి ఎదుటివారికి వుండకూడదనా?

కమల నాతో ముభావంగానే వుంటోంది. నా అవసరాలు కనిపెడుతోంది. కానీ ఏదో పెద్ద లోపం. స్వచ్ఛంగా వుండే ఆ ముఖంలో ఏదో మబ్బుతెర. ఏదో ఉదాసీనత. నేను భరించలేని తట్టుకోలేని మౌనం.

మా మధ్య శారీరక సంబంధాలు ఇంచుమించు లేవనే చెప్పాలి. కానీ రెండు రోజుల నుండీ ఆమె నాకు ఒక్క అంగుళం దూరంగా వున్నా భరించలేని తపన, రాత్రయితే ఆకుపచ్చని గాజుల కుడిచేయి నా గుండెలమీద వేసి నిద్రపోయే కమల నాకు మరింత దగ్గర కావాలనే ఆరాటం.

కానీ కమల డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో పడుకుంది. పిలవాలనిపించింది. కానీ ఏదో బెరుకు. ఇన్నాళ్ళ సహచర్యంలో ఇంతేనా అర్థమైందనే బాధ, మగవాడంటే ఆడదానికెంత లోకువా- అని కోపం, ఎప్పుడో నలభై ఏళ్ళ క్రితం నేను పెళ్ళి చేసుకో బోతున్న అమ్మాయిని ఇష్టపడిన నేరానికి ఇప్పుడు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చిందనే అవమానం.

సరిగ్గా ఈరోజు మూడోరోజు నేను సాయిబాబా మందిరంలోకి అడుగుపెట్టాను. ఉపన్యాసం ఇంకా మొదలవలేదు. అప్పటికే చాలామంది వచ్చి కూర్చున్నారు. మరికాస్సేపటికి మందిరం అంతా నిండిపోయింది. నేను ఓ ప్రక్కగా కూర్చుని అందర్నీ పరిశీలిస్తున్నాను. అందరి ముఖాల్లోనూ ఏదో అశాంతి, ఆవేదన – అందరూ అక్కడ దొరికే మనశ్శాంతి కోసం వచ్చినట్లనిపించింది నాకు.

సుందరేశ్వరస్వామి తన ఉపన్యాసం మొదలుపెట్టారు. అత్యంత గంభీరంగా నెమ్మదిగా ప్రతీ చిన్న విషయానికీ ఉదాహరణలిస్తూ పండిత పామరుల కిద్దరికీ నచ్చేవిధంగా చెప్తున్నారు.

దేవుడు, భక్తి అనేదానికంటే ఆయన మానవ మనస్తత్వాల గురించి ఐహిక దుఃఖాల గురించి ఈర్ష్య, అసూయ, మోహం, కామం గురించి వాటిని జయించి సత్యాన్వేషణ చెయ్యమని బోధిస్తున్నారు. ఆయన ఉపన్యాసంలో నాకు బాగా నాటుకున్నది. "ఎదుటివారిని చూసి ఈర్ష్య ప్రదర్శించడం అరికట్టుకున్నంత మాత్రాన సరిపోదు. ఒక్కొక్కసారి అన్యాయంగా మనమీద పక్కవారు ఈర్ష్యపడినప్పుడు మనం ఎంతో మనోనిబ్బరం ప్రదర్శించాలి. ధైర్యం వహించాలి. సహనం కోల్పోకూడదు."

"తమకి లభించనిది ఎదుటివారికి లభిస్తే ఈర్ష్యపడతారు ఎదుటివారి మీద – మన మీద ఎదుటివారు ఈర్ష్యపడితే – మన దగ్గరవాళ్ళు ఈర్ష్యపడదగ్గ అపురూపమైనదేదో వుందని గ్రహించి దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి".

నాలో తళుక్కునేదో స్ఫురించింది. నిజమే ఈ మాటలు కమల వింటే ఎంత బావుండును? అనుకున్నాను. ఆడవాళ్ళు కూర్చున్నవైపు చూసాను. కమల ఎక్కడా కనిపించలేదు. తక్కిన ఉపన్యాసం అంతా అన్యమనస్కంగా విన్నాను. సందేహం లేదు. సుభద్ర పట్టరాని ఈర్ష్యతోనే వచ్చి మా సంసారామృతాన్ని తన పాపిష్టి వేలితో కెలికింది. ఈ విషయం కమల గ్రహిస్తే ఎంత బావుండును? కమల తెలివైంది. ఈ మాటలు తనకి అన్వయించుకునే జ్ఞానం వుంది. ఉపన్యాసం అయిపోయింది. బైటికొచ్చి నడుస్తూన్న నాకు దూరంగా నడిచి వెళ్ళిపోతున్న కమల కనిపించింది. నాకు మనసంతా సంతోషం కమ్ముకొస్తోంది. గబగబా నేను ఇంటికి చేరేసరికి కమల వేడి వేడి కాఫీ గ్లాసు అందించింది. ఆమె వంక తేరిపార చూసాను. తెరిపిగా వుంది. మబ్బులు వర్షించిన ఆకాశంలా స్వచ్ఛంగా వుంది. హరివిల్లు మెరిసినట్లు చిరుదరహాసం ఆమె పెదవుల మీద మెరుస్తోంది. అసలు సిసలు నా కమల నాకు కనిపించినట్లయింది. కమల అర్థం చేసుకుంది.

నా మనస్సెంతో తేలికపడింది. నేను అనుకున్నట్లుగానే సుభద్ర సంసారం గురించి తెలుసుకుని సుందరేశ్వరస్వామి ఉపన్యాసం అన్వయించుకుని మనసు తెరిపి చేసుకుంది కమల. మూడురోజుల పాటుగా నా మనసు పడిన వేదనవల్ల నాకు దేవుడి గురించి ఆలోచన కలిగింది.

మొదటిసారిగా ఏ రూపానికీ చెందని ఒకానొక అజ్ఞాతశక్తికి నమస్కరించాను.

●